# పండు

స్వప్నరాగలీన

ఆ రేళ్ళవండు వాళ్ళ నాన్న ఫొటో ముందు కూర్చుని తదేకంగా చూస్తోంది. కళ్ళలో నీటిపొర రాలటానికీ, ఇంకటానికి కూడా సంశయిస్తున్నట్టుంది. ఈ మధ్యనే వాళ్ళ నాన్న చనిపోయాడు. ఆయన మరణం భార్య శారదని, బంధుమిత్రులని కలిచివేయటం అలా వుంచి పండు గుండెల్లో అగ్ని పర్వతమయి పేలింది. ఆయన మరణం ఆ చిన్ని గుండెకు కొత్త అర్థం చెప్పింది.

ఆ రోజు స్కూల్‌నుంచి వచ్చిన పండు ఇంట్లో జరుగుతుంది చూసి మొదట అర్థం కాక కొయ్యబారిపోయింది. నాన్న కింద పడుకున్నారేంటి? నిద్రపోతున్న నాన్నమీద పడి అందరూ అలా ఎందుకు ఏడుస్తున్నారు..? ఎంత ఆలోచించినా సమాధానం దొరకలేదు. అయినా అమ్మ ఏడవటం చూసి పండుకి ఏడుపు తన్నుకొచ్చింది. దుఃఖాన్ని ఆపుకోలేక అమ్మని కౌగిలించుకుని ఏడ్చేసింది.

అంత దుఃఖం లోనూ పండు పరిస్థితి చూసి వాళ్ళమ్మ శారద కంగారుపడింది. నాన్న మీద పండుకి వున్న మమకారం, ప్రేమానురాగాలు తనమీద కూడా లేవన్న సంగతి శారదకు తెలీనిది కాదు. వెంటనే శారద పండుని తోటలోకి తీసుకుని వచ్చింది.

"అమ్మా..! నాన్న ఎందుకలా నిద్రపోతున్నారు? మీరంతా ఎందుకలా ఏడుస్తున్నారు?" వెక్కిళ్ళ మధ్య అడిగింది పండు.

"ఇప్పుడు నాన్న మనకు లేరు తల్లీ" చెప్పింది శారద.


"నాన్న ఇక్కడే ఉన్నారు కదమ్మా..! – పరుపు మీద నుంచి నాన్నని కిందికి ఎందుకు తోశారు? నాన్న ఎప్పుడు నిద్రలేస్తారు..? ". పండుకు ఎలా చెప్పాలి..? ఎట్లా చెప్తే అర్థమవుతుంది. పండుని దగ్గరకు తీసుకుని గుండెలకి హత్తుకుంది.

" నాన్న మరణించారు తల్లీ" బాధని అణచి పెట్టుకుంటూ స్పష్టంగా చెప్పింది శారద.

"మరణించటమంటే..?"

"మనకు నాన్న ఇక కన్పించరు. ఎప్పుడూ కనిపించరు" వణికే గొంతుతో చెప్పింది.

"నేను గుర్రం ఆట ఎలా ఆడుకోవాలి? రోజూ నాన్న చెప్పే కథలు వింటూ నాన్న ఛాతీ మీద నిద్రపోతానుగా. నాన్న కన్పించకపోతే ..ఎ..లా?' 'కన్పించరు' అనేదొక్కటే అర్థమయినట్టుంది. ఏమనుకుందో ఏమో ఒక్కసారిగా ఏడ్చేసింది. అక్కడున్న కొద్దిపాటి నిశ్శబ్దాన్నీ చీల్చేసిందా ఏడుపు. అక్కడున్న బంధువులందరి హృదయాలని కలచి వేసింది ఆ పసిగొంతు.



పండుకు అమ్మకంటే నాన్నంటేనే బాగా ఇష్టం. బాగా అలవాటు. వాళ్ళ నాన్నకు కూడా పండూనే పంచప్రాణాలు. ఆఫీసునుంచి వచ్చాక మళ్ళీ ఆఫీసుకెళ్ళేంత వరకూ పండూనే ఆయన ప్రపంచం.

ఉదయం నిద్రలేస్తూనే వాలు కుర్చీమీద పేపర్ చదువుతూ కనిపించే నాన్న దగ్గరికి చప్పుడు కాకుండా వెళ్ళి పేపర్ లాక్కుని కిచెన్‌లోకి పరుగెత్తేది పండు. అప్పట్నుంచి తండ్రీకూతుర్ల అల్లరితో ఇల్లంతా కోలాహలంగా మారిపోయేది.

"నాన్నా..! మీరు కూడా నాలా చిన్న పిల్ల ఎందుకవ్వరూ?

"చిన్నపిల్లనయితే .. నిన్ను గుర్రం ఎక్కించుకోవటం కుదర్దుగా అందుకని..''

"ఒహో అలాగా..!" అంటూ ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి ఆరిందాలా గలగలా మాట్లాడే పండు ఒక్కసారిగా మూగబోయింది. ఎపుడు చూసినా తండ్రి ఫొటో వైపే చూస్తూ కూర్చుంటుంది.

తండ్రి చనిపోయి నెలరోజులు గడచిపోయాయి. వచ్చిన బంధుమిత్రులంతా వెళ్ళిపోయారు. ఇల్లంతా శూన్యమయిపోయింది.

* * * * *

ప్రవహించే పిల్లకాలువ ఒకచోట నిశ్చలంగా నిలిచిపోయినట్టు పండు అల్లరి చేయటం మాని మౌనంగా వుండిపోవటం శారదని మరీ కృంగదీస్తోంది. తండ్రి కూర్చునే వాలుకుర్చీ మీద కూర్చోవటం, తండ్రి వాడిన కళ్ళద్దాలు పెట్టుకోవటం, లేదంటే తండ్రి వాడిన వస్తువుల్ని నాన్ననే తాకుతున్నంత ఆప్యాయంగా తాకటం, తండ్రి బట్టలు తలకింద పెట్టుకుని నిద్రపోవటం లాంటివన్నీ శారదకు కొంచెం వింతగానూ, బాధగానూ తోచేది.

"పండూ..! ఇవాళ శనివారం. సోమవారం నుంచి నువ్వు స్కూలుకెళ్ళాలి"

ఏదైనా మాట్లాడాలని కదిలించింది శారద.

తనను కాదన్నట్టుగా పట్టించుకోకుండా మౌనంగా వుండిపోయింది పండు.

"బ్యాగ్ కూడా తెచ్చాను. నువ్వు స్కూలుకు తీసుకుపోవచ్చు ఎంచక్కా..!"

బ్యాగ్ అనగానే ఉత్సాహంతో ఎగిరి గంతేస్తుందన్న నమ్మకముంది ఏ మూలనో. ఆ మాట కూడా పండు మీద ప్రభావం చూపించలేదు. చూపుల్ని ఎప్పట్లాగే తండ్రి ఫొటో మీద గుచ్చి మౌనంగా వుండిపోయింది.

పండు మౌనం శారదని బాగా భయపెడ్తోంది.

హఠాత్తుగా మౌనాన్ని తానే ఛేదిస్తూ అడిగింది పండు.

"నాన్న ఎలా చనిపోయారమ్మా? ఎవరు చంపారు?"

మౌనం కంటే భయంకరమైన ప్రశ్నలా తోచింది. అవాక్కయింది శారద. ఏదో ఆలోచన వచ్చినట్టు మళ్ళీ అడిగింది పండు.

"మనింటికి పోలీసులు ఎందుకు రాలేదమ్మా..? నాన్నకు రక్తం కూడా కన్పించలేదేమిటి?"

"నాన్న కిడ్నీలు పాడయి తనకు తానే చనిపోయారమ్మా? నాన్ననెవరూ చంపలేదు. కిడ్నీలు పనిచేయటం మానేస్తే మనిషి చనిపోతాడు." చెప్పింది శారద.

" కాదు. నువ్వు అబద్ధం చెప్తున్నావు. కత్తితో పొడిస్తే, తుపాకీతో కాలిస్తే, పెట్రోలు పోసి తగలబెడితే చచ్చిపోతారు మనుషులు" చాలా సీరియస్‌గా చెప్పింది పండు.

పండు చెప్పేదేమిటో అప్పుడర్థమయింది శారదకు. టీవీలో చూపించే చావులతో తండ్రి చావును పోలుస్తుంది తను. అలాంటి వాటిలో ఏ వొక్కటీ కాకపోవటంతో సహజమైన మరణం కూడా అసహజంగా తోస్తుంది తనకు.

"నిద్రపోతున్న నాన్నని నలుగురు మోసుకెళ్ళి కట్టెల మీద పడుకోబెట్టి నాన్న నిద్రలేవకముందే కాల్చేశారు" - తను కళ్ళారా చూసినదాన్ని చూసినట్టు చెప్పింది. లేత. వయసు పిల్లల మస్తిష్కంలో ఇన్ని అపార్థాలు రావటానికి కారణం ఎవరు..? టీవీ సీరియళ్ళు..సినిమాలు పిల్లలమీద చూపే ప్రభావాల ముందు నిజం ఎంత అబద్ధమయిపోయిందో కదా!

సహజ మరణాన్ని సహజంగా స్వీకరించలేని పండు జీవితాన్ని ఎంత వికృతకోణంలో అర్థం చేసుకుంటుందోనని శారద భయపడ్తోంది. ఇక పండుని ఆ మృత్యు భయం నుంచి తొలగించకపోతే లాభంలేదు. 'పండుకు ఆలోచించటానికి సమయం లేకుండా బాగా బిజీ చేయాలి' అనుకుంది. స్కూలు నుంచి రాగానే పండుకు ఇష్టమయిన బొమ్మలు గీసే కార్యక్రమంలో పడేసింది. భర్త చనిపోవటం తనకో శాపం కాగా పసిపిల్ల కూడా ఎక్కడ దూరమవుతుందోననే భయంతో తన నిరాశల్ని పక్కన పెట్టి పండుని మామూలుపిల్లను చేయటానికి పూనుకుంది.

రంగురంగుల బొమ్మలు తన మనోవికాసానికి తోడ్పడతాయనీ, తన ఆలోచనల్లో ఆశావాదిని చేస్తాయనీ ఆశించింది. నిజంగానే పండు కూడా రంగుల ప్రపంచంలో పడి అన్నీ మరిచిపోతుంది మెల్లగా.

నాన్న మరణం మరుపు తెరల మధ్య తనొక మంచి ఆర్టిస్ట్‌గా రూపుదిద్దుకుంటోంది. పండు మార్పును గమనిస్తున్న శారద విజయం సాధించినట్టు ఊపిరి పీల్చుకుంది. ఒకరోజు ఏదో బొమ్మ గీస్తూ గీస్తూ రంగుడబ్బా పడేసుకుంది. వెంటనే శారద దగ్గరికి పరిగెత్తి ..

"అమ్మా..! నేను గీసే పెయింటింగ్ కూడా చచ్చిపోతుందా?" అడిగింది.

శారద ముందు అవాక్కయి వెంటనే కోలుకుని చెప్పింది.


"అవునమ్మా, మనం జాగ్రత్తగా చూసుకున్నంత కాలం బావుంటాయి. తర్వాత రంగులు వెలిసి చచ్చిపోతాయి."

"అంటే నాన్నని మనం జాగ్రత్తగా చూస్కోనందుకే చచ్చిపోయారా?"

పండు మాటలు మెదడు మీద సమ్మెట దెబ్బల్లాగా తగులుతున్నాయి. ఏం మాట్లాడటానికీ పాలుపోలేదు. పండువైపు చూస్తూ వుండిపోయింది.

ఆలోచనల్ని మెదడులోకి ఎక్కిస్తున్నట్టు,నేల మీద వొలికిన రంగుని డబ్బాలోకి తోడే ప్రయత్నం చేస్తోంది పండు. ●

## తేనీటి కోసం తహతహలాడిన రచయిత!



ఓ పెద్ద పత్రికలో తక్కువ జీతానికి పనిచేస్తూ పొట్ట గడుపుకుంటున్న విలేకరులు ఒకరోజు టీ తాగేందుకుకూడా జేబులో చిల్లిగవ్వ లేకపోవడంతో దిగాలుగా కూర్చున్నారు.

"టీ తాగాలంటే కనీసం మూడు డాలర్లయినా కావాలిగదా? ఎలా?" అని ఒక విలేకరి అంటే-

"దేవుని దయ వుంటే అదేమంత భాగ్యం" అన్నాడు రెండో విలేకరి.

"సరేలే నీదంతా అదో రకం వైఖరి" అంటూ హోటల్లో వరండాలో చతికిలపడ్డాడు మొదటి విలేకరి.

అంతలోనే ఎక్కడినుంచి వచ్చిందోగాని ఒక బొచ్చుకుక్క ఆయన దగ్గరకు తోకాడించుకుంటూ వచ్చింది. దాన్ని చూసి ముచ్చట పడి ప్రేమగా నిమురుతూ కూర్చున్నాడు రెండో విలేకరి.

శునకాన్ని చూసిన హోటల్ యజమాని పరుగు పరుగున అతని దగ్గరికి వచ్చి-

"దీన్ని అమ్ముతావా?" అన్నాడు.

"అమ్ముతాను ధర మూడు డాలర్లు మరి" అన్నాడు ఆ విలేకరి.

"మూడేంటి. వంద ఇస్తాను." అన్నాడు హోటల్ యజమాని.

"మూడు డాలర్లకే అమ్ముతాను" అని గట్టి పట్టుపట్టిన ఈ విలేకరికేసి ఆశ్చర్యంగా చూస్తూ మూడు డాలర్లు ఇచ్చేసి శునకాన్ని తీసుకెళ్లాడు ఆ హోటల్ యజమాని.

అంతలోనే ఒక పెద్దమనిషి దేనినో వెతుక్కుంటూ వచ్చాడు."

"ఏమండీ! కుక్కకోసమేనా వెదుకుతున్నారు?" అని అడిగాడు అదే విలేకరి.

"అవును...మీకుగాని కనిపించిందా?" అన్నాడా పెద్దమనిషి.

"ఫీజు...మూడు డాలర్లవుతుంది మరి" అన్నాడా విలేకరి.

"మూడు కాదు, ముప్పయి డాలర్లు ఇస్తాను."

"అదేం కుదర్దు. మూడంటే మూడే డాలర్లివ్వాలి'

"సరే" నని అతడు మూడు డాలర్లివ్వగా ఆ డబ్బును తీసుకెళ్లి హోటల్ యజమానికిచ్చి -

"మనసు మార్చుకున్నానండీ. కుక్కని అమ్మాలని అనిపించడంలేదు" అన్నాడు.

"పిచ్చివాడు లాగున్నాడు" అనుకుని కుక్కని ఇచ్చేశాడా యజమాని.

కుక్కని దాని యజమానికి చ్చేసాడు.

తాను కష్టపడి మూడు డాలర్లు సంపాదించానని తృప్తి చెందాడు. తేనీటి కోసం తహతహలాడిన కొన్ని నిమిషాల్లోనే మూడు డాలర్లు సంపాదించేసిన ఆ విలేకరి ఎవరో కాదు సుప్రసిద్ధ రచయిత మార్క్ ట్వేన్.

'టామ్ సాయర్', హకల్ బెరీ ఫిన్'వంటి నవలలు మార్క్ ట్వేన్‌కు అనితర ఖ్యాతినార్జించి పెట్టాయి.

-డాక్టర్ లక్ష్మీనారాయణమూర్తి శ్రీరామ